www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

## కాలువల పేరు తో మరోసారి రైతులను మోసం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు



3

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 227 | ఆదివారం | 12- 01 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## చలికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోండి



తొలిఅడుగు, న్యూఢిల్లీ : జర్నలిస్ట్ మిత్రులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కీలక సూచన చేశారు. ప్రస్తుతం చలికాలం దృష్ట్యా అనారోగ్యం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ మీటింగ్‌కు హాజరయ్యేందుకు వచ్చిన ప్రధాని మోదీ.. కారు దిగి నేరుగా జర్నలిస్ట్‌ల వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న జర్నలిస్ట్‌లతో మాట్లాడారు. ముందుగా వారందరికీ నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈ చలికాలంలో మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకోండి అంటూ సలహా ఇచ్చారు. అనారోగ్యం బారిన పడకుండా తలను కప్పుకోండి అంటూ సూచించారు.

## రైల్వేస్టేషన్‌లో కూలిన ప్రవేశద్వారం పైకప్పు

### శిథిలాల కింద చిక్కుకున్న పలువురు కూలీలు..




తొలిఅడుగు, రైల్వేస్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న ప్రవేశద్వారం పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. దాంతో నిర్మాణ పనులు చేస్తున్న పలువురు కూలీలు శిథిలాల కింద చిక్కుకున్నారు. ఘటనపై సమాచారం అందిన వెంటనే రెస్క్యూ టీమ్స్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నాయి. సహాయక చర్యలు మొదలుపెట్టాయి. శిథిలాల కింది చిక్కుకున్న 11 మందిని వెలికితీశాయి. వారికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం

2

## కార్చిచ్చులకు 10 వేల నిర్మాణాలు ఆహుతి

### లాస్ ఏంజెల్స్‌లో 10కి పెరిగిన దావానల మృతుల సంఖ్య

### ఇదే అదనుగా సంపన్నుల ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగలు



తొలిఅడుగు, లాస్ ఏంజెల్స్: అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో చెలరేగిన రెండు కార్చిచ్చుల ధాటికి ఇప్పటి వరకు 10 మంది చనిపోయారని, 10 వేల నిర్మాణాలు దగ్ధమ య్యాయని అధికారులు గురువారం తెలిపారు. కొత్త కార్చిచ్చు వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో మరింత మంది ప్రజలు అక్కడి నుంచి తరలి వెళ్లాలని వారు విజ్ఞప్తి చేశారు. సాన్

2

## తిరుమలలో చిరుత



తొలిఅడుగు, తిరుపతి: తిరుమలలో చిరుత సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. అలిపిరి వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న టీటీడీ ఉద్యోగికి చిరుత కనిపించింది. చిరుతను చూడగానే అతను తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి

2

## నా ఉద్దేశం అదికాదు.. తప్పుగా అనుకోవద్దు



తొలిఅడుగు, హైదరాబాద్ : హీరో వెంకటేష్ నటించిన "సంక్రాంతికి వస్తున్నాం" సినిమా ఈవెంట్‌లో భాగంగా ప్రముఖ నిర్మాత, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. "సంక్రాంతి పండుగకు ఆంధ్రాలా తెలంగాణలో వైబ్ ఉండదు. తెల్ల కల్లు, మటన్ మాంసం మీద వైబ్స్

2

## ఈ నెలాఖరులోగా ఉస్మానియా ఆసుపత్రి

# నిర్మాణానికి శంకుస్థాపన



- ఆ దిశగా చర్యలు చేపట్టండి
- భవిష్యత్ అవసరాలకనుగుణంగా డిజైన్లు ఉండాలి
- అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తొలిఅడుగు, హైదరాబాద్ : ఈనెలాఖరులోగా కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై శనివారం తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్ లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు సూచించిన మ్యాప్ లలో పలు మార్పులు, చేర్పులను సూచించారు సీఎం. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు సీఎం.

2

## ఆన్‌లైన్ గేమ్స్‌కు యువకుడి బలి



తొలిఅడుగు, వరంగల్ : ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై మరో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకున్నది. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన లైశెట్టి కుమారస్వామి, సుజాత దంపతుల చిన్న కొడుకు రాజు(25) ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డాడు. తెలిసిన వారి వద్ద సుమారు రూ.30 లక్షల వరకు అప్పు చేసి, ఆన్‌లైన్ గేమ్స్‌లో పోగొట్టుకున్నాడు. తనకు మరో రూ.4 లక్షలు కావాలని నాలుగు రోజుల క్రితం తండ్రిని అడగ్గా లేవని చెప్పాడు. చేసిన అప్పులు తీర్చేమార్గం కానరాక, రెండు రోజులుగా మనోవేదనకు గురైన రాజు శనివారం తెల్లవారుజామున ఇంట్లోని స్లాబ్ కొక్కానికి చీరెతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కోడిపందెం శిబిరంపై దాడి



తొలిఅడుగు, అమరావతి : విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం రామవరంలో నిర్వహిస్తున్న కోడిపందెం శిబిరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య సహా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8 కోళ్లు, 20 కోడి కత్తులు, రూ. 2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కోడిపందెం నిర్వహణకు సంబంధించి

2

## ముఖ్యమంత్రి ఆదేశాలతోనే ఈ దాడి

### – అరాచక శక్తులకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఆవేదన కేటీఆర్



తొలిఅడుగు, హైదరాబాద్ : యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాలతోనే కాంగ్రెస్ నేతలు ఈ భౌతిక దాడులకు తెగబడుతున్నారని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హెూంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి ఆదేశాలతోనే

2

# రైల్వేస్టేషన్‌లో కూలిన ప్రవేశద్వారం పైకప్పు

మొదటిపేజీ తరువాయి హుటాహుటిన ఆస్పత్రికి తరలించాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకుని ఉన్న మిగతా కూలీలను రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రెస్క్యూ టీమ్స్‌తోపాటు స్థానిక అధికారులు, పోలీసులు ఈ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్ రైల్వేస్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ స్పందించారు. ప్రమాద ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సీఎం యోగి చెప్పారు. వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి తక్షణమే అవసరమైన మెడికల్ ట్రీట్‌మెంట్‌ను సమకూర్చాలని సూచించారు. బాధితులంతా త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు.


# కార్చిచ్చులకు 10 వేల నిర్మాణాలు ఆహుతి

ఫెర్నాండో లోయలో మధ్యాహ్నం ప్రారంభమైన కొత్త కెన్నెత్ దావానలం సాయంత్రానికి పక్కనున్న వెంచురా కౌంటీకి వ్యాపించిందని వెల్లడించారు. బలమైన గాలులు తోడు కావడం వల్ల మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయని, శుక్రవారం ఉదయానికి ఇవి మరింత బలపడొచ్చని లాస్ ఏంజెల్స్ మేయర్ కరెన్ బస్ తెలిపారు. కెన్నెత్ కార్చిచ్చుకు కారణమని భావిస్తున్న నిరాశ్రయుడిని పోలీసులు గురువారం అదుపులోనికి తీసుకున్నారు. మరోవైపు కార్చిచ్చు కారణంగా ఖాళీ అయిన సంపన్నుల ఇండ్లను దోచుకోవడానికి దొంగలు ఎగబడుతున్నారు. ఇప్పటికే 20 మంది దొంగలను అరెస్ట్ చేశారు.

# కోడిపందెం శిబిరంపై దాడి

మొదటిపేజీ తరువాయి పలువురి పాత్రపై విచారణ కొనసాగుతోందని పోలీసులు వివరించారు. సంక్రాంతి పండుగ సమయాల్లో కోడి పందెలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఎక్కడైనా కోడిపందెలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# తిరుమలలో చిరుత



మొదటిపేజీ తరువాయి డివైడర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో బాధితుడికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న టీటీడీ అధికారులు అప్రమత్తమయ్యారు. చిరుత సంచారంపై భక్తులను అప్రమత్తం చేశారు. అలిపిరి సమీపంలో చిరుత సంచరిస్తున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. భక్తులందరూ అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిస్తున్నారు. మరోవైపు చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులకు టీటీడీ సిబ్బంది సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఫారెస్ట్ అధికారులు.. చిరుత కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దాన్ని పట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ట్రాప్ కెమెరాలు అమర్చడం సహా బోన్ ఏర్పాటు చేయడం వంటి అంశాలపై చర్చిస్తున్నారు.

# మంత్రి ఆనంపై టీటీడీ మాజీ చైర్మన్ ఫైర్..

తొలిఅడుగు, అమరావతి : అమరావతి : ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డిపై టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నాయకుడు భూమన కరుణాకర్ రెడ్డి ఫైర్ అయ్యారు. తిరుపతి ఘటనలో గాయపడ్డ వారిని పరామర్శించేందుకు వెళ్లిన వైసీపీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాలని డబ్బులు పంచారని, ఆసుపత్రిలో పరికరాలను ధ్వంసం చేసిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయని మంత్రి ఆరోపించారు. ఈ ఆరోపణలను భూమన ఖండించారు. దేవుడి మీద భక్తి ఉంటే సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను విడుదల చేయాలని, లేనిపక్షంలో మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకోవడానికి టీటీడీ తిరుపతిలో టోకెన్ల జారీ కేంద్రాలను ప్రారంభించింది. ఈ సందర్భంగా పద్మావతి పార్కులో నెలకొల్పిన కేంద్రం వద్ద జరిగిన తొక్కిసలాటలో 6గురు చనిపోగా మరో 48 మంది గాయపడ్డారు. గాయపడ్డవారిని రుయా, స్విమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం, రాష్ట్ర మంత్రులు పరామర్శించారు.

# ఈ నెలాఖరులోగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



# ముఖ్యమంత్రి ఆదేశాలతోనే ఈ దాడి



మొదటిపేజీ తరువాయి కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోయి, ఇలాంటి దాడులకు తెగబడుతున్నారు. కాంగ్రెస్ చేసిన మోసాలపై జిల్లాపార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేకే ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడ్డారన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను నమ్మించి నయవంచన చేసిన మీ పాలనను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం.. పాలనా వైఫల్యాలను ఎత్తిచూపిన ప్రధాన ప్రతిపక్షంపై దాడులు చేయడమే ఇందిరమ్మ రాజ్యమా ? అన్నారు. పదేళ్లపాటు ప్రశాంతంగా కొనసాగిన తెలంగాణ రాష్ట్రం, ఈరోజు అరాచకాలకు చిరునామాగా మారిందని, దాడులు, గుండాగిరి తమ మార్కు పాలన అని కాంగ్రెస్ పార్టీ మరోసారి నిరూపించుకుంటుందన్నారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపైన దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ అలవాటుగా మారిందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అరాచక శక్తులకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని, ఇందిరా రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో గూండారాజ్యం చలాస్తుందన్నారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుని ఫోజులు కొట్టే రాహుల్ గాంధీకి, రేవంత్ సర్కారు పాలనలో సాగుతున్న ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు కనిపించడం లేదా అన్న కేటీఆర్, రాహుల్ గాంధీ ఇప్పటికైనా తమ హిపోక్రసీని కట్టిపెట్టి, గుండాల చేతిలో చిక్కిన తెలంగాణ కాంగ్రెస్ సర్కారును సరిదిద్దాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలన్నారు. ఎన్నుకున్న ప్రజలతోపాటు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై, నాయకులపై, పార్టీ కార్యాలయాల పైన దాడులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కార్యాలయానికే రక్షణ లేకపోతే ఇక రాష్ట్రంలో పరిశ్రమలకు, పెట్టుబడులకు, మారుమూల పల్లెల్లో నివసిస్తున్న పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందన్నారు. ఇలాంటి దాడులతో బీఆర్ఎస్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూడటం ముఖ్యమంత్రి అవివేకం అన్న కేటీఆర్, సమైక్యరాష్ట్రంలో ఇంతకన్నా వందరెట్ల అణచివేతను, నిర్బంధాన్ని, దాడులను తట్టుకుని నిలబడిన తెలంగాణ ప్రజల గుండెచప్పుడుగా బీఆర్ఎస్ నిలిచిందన్నారు. మా పార్టీ కార్యకర్తల జోలికి, కార్యాలయాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 60 లక్షల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కన్నెర్ర చేస్తే కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజాక్షేత్రంలో తిరగగలరా ? ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వెంటనే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలతో పాటు, వారి వెనుక ఉన్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మీరెన్ని దాడులు చేసినా, ఎన్నిరకాల అక్రమ కేసులు బనాయించినా తెలంగాణ ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటాం.. ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించుకున్న రాష్ట్రాన్ని కంటికి రెప్పలా కాపాడుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉంటామని కేటీఆర్ తెలిపారు.

# నా ఉద్దేశం అదికాదు.. తప్పుగా అనుకోవద్దు

మొదటిపేజీ తరువాయి ఉంటాయి" అంటూ బడా నిర్మాత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీంతో దిల్ రాజు తెలంగాణ వాళ్లను అవమానించేలా మాట్లాడారంటూ పలువురు సోషల్ మీడియా వేదికగా కామెంట్లు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తాను చేసిన వ్యాఖ్యలపై దిల్‌రాజు స్పందిస్తూ.. శనివారం వీడియోను విడుదల చేశారు. "నిజామాబాద్ పట్టణంలో "సంక్రాంతికి వస్తున్నాం" సినిమా ఈవెంట్ చేశాం. మన దగ్గర సినిమా ఈవెంట్స్ పెద్దగా జరగవు. అప్పట్లో "ఫిదా" సక్సెస్ మీట్ పెట్టాను. నిజామాబాద్ వాసిగా ఈ ప్రాంతంతో నాకున్న అనుబంధం అలాంటిది. మన సంస్కృతిలో ఉండే దావత్ గురించి, మటన్, తెల్ల కల్లు గురించి మాట్లాడాను. ఆ మాటల్లో తెలంగాణ వాళ్లను అవమానించానని, అవహేళన చేశానని కొంతమంది మిత్రులు కామెంట్లు చేసి, సోషల్ మీడియాలో పెట్టారని తెలిసింది. తెలంగాణ దావత్ నేను మిస్సవుతున్నాను. సంక్రాంతికి వస్తున్న ఈ రెండు సినిమాలు విడుదలయ్యాక దావత్ చేసుకోవాలని ఉంది అని చెప్పటం నా ఉద్దేశం. అదే విషయాన్ని ఈవెంట్ చివరిలోనూ చెప్పా. మన సంస్కృతిని నేను అభిమానిస్తా. అది అర్థం చేసుకోకుండా సోషల్ మీడియాలో రాద్ధాంతం చేస్తున్నారని తెలిసింది. నిజంగా మీరందరూ ఆ మాట వల్ల మనస్తాపం చెందితే క్షమించండి. నిజంగా నా ఉద్దేశం అది కాదు" అని స్పష్టం చేశారు.

నిజామాబాద్ జిల్లా బాన్సువాడలో "ఫిదా" సినిమాను తీశానని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఆ సినిమాకు ఎంతో ఆదరణ వచ్చిందన్నారు. కుటుంబ బంధానికి ఎంత విలువ ఇస్తామో అందులోని భానుమతి పాత్ర ద్వారా చెప్పామని.. ఆ మూవీ పెద్ద హిట్ అయ్యిందని తెలిపారు. అలాగే "బలగం" సినిమా తీసినప్పుడు తెలంగాణ సమాజం తమను అభినందించిందన్నారు. "ఇది మా సినిమా" అని ఇక్కడి ప్రజలు గుండెలకు హత్తుకున్నారు. అన్ని రాజకీయ పార్టీలు తమపై ప్రశంసలు కురిపించాయన్నారు. తెలంగాణ వాసిగా ఈ రాష్ట్ర సంస్కృతిని హేళన చేస్తానని ఎలా అనుకున్నారో తెలియదన్నారు.

నా మాటలు తప్పుగా అర్థం చేసుకుని ఉంటే క్షమించండి. మనోభావాలు దెబ్బతిన్నాయని అనుకుంటున్న వారికి నా క్షమాపణలు.. సినిమా రంగంలో కిందిస్థాయి నుంచి ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా ఎదిగాను. ఇటు సినిమా ఇండస్ట్రీ, అటు ప్రభుత్వానికీ మధ్యలో ఉంటూ పరిశ్రమకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నా. తెలంగాణలో తెలుగు సినిమా అభివృద్ధి చెందడంతో పాటు, యువతకు ఉపయోగపడేలా పనిచేస్తా. ఇటీవల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా సూచనలు చేశారు. ఆ ప్రభుత్వంతో కూడా కలిసి పరిశ్రమ అభివృద్ధికి, తెలుగు సినిమాకు సహకారమందిస్తా. ఎఫ్‌డీసీకి రాజకీయాలతో సంబంధం లేదు. ఇలాంటి అనవసర విషయాల్లోకి నన్ను లాగొద్దని తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నా" అంటూ దిల్‌రాజు వీడియోలో చెప్పుకొచ్చారు.

హైదరాబాద్
తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# కాలువల పేరు తో మరోసారి రైతులను మోసం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## – పాలాభిషేకాల పేరుతో హరీష్ రావు అనుచరుల డ్రామాలు – మండల పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్

తొలి అడుగు, చిన్నకోడూరు, జనవరి 11 : అధికారం లో ఉన్నప్పుడు సోయి లేకుండా ఇప్పుడు అధికారం కోల్పోయాక కాలువల పేరు తో బీఆర్ఎస్ నాయకులు పాల అభిషేకల పేరు తో డ్రామాలాడుతూ రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా చిన్నకోడూరు మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ... 10 ఇండ్లు అధికారం లో ఉండి నియోజకవర్గం లో చిన్నకోడూరు మండలం లో కొచ్చాగుట్ట పల్లి, ఎల్లయ్యపల్లి, కొత్తపల్లి, కాసారం పల్లి, అల్లీపూర్, చెలకలపల్లి గ్రామ ల రైతు ల భూములు పరిహారం ఇవ్వకముందే దౌర్జన్యంగా గుంజుకొని అన్నపూర్ణ రిజర్వాయర్ నిర్మించి కాలువలు తవ్వకుండ హరీష్ రావు అనుచరులు అడ్డుకుంటూ ఉంటే అప్పుడు అధికారం లో ఉన్న మంత్రి హరీష్ రావు తమ అనుచరులు భూములు కోల్పోవద్దని డ్రామాలాడుతూ కాలువలు తవ్వడం మరిచి ఇప్పుడు అధికారం పోగానే తమ అనుచరుల తో పాలాభిషేకాలు చేయించుకోవడం సిగ్గుచేటన్నారు. అంతే కాకుండా మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన కాలువలు తవ్వి మండలం లోని అన్ని చెరువులకు నీరు ఇచ్చేవిధంగా ఉమ్మడి జిల్లా పెద్దలు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజానర్సిహా, ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి దృష్టికి తీసుకువెలుతామన్నారు ఈ కార్యక్రమం లో మండల పార్టీ ఉపాధ్యక్షులు సందబోయిన పర్శరాం, సెక్రటరీ కోరిమి రాజు, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బర్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.



# సీఎం చిత్రపటానికి పాలాబిషేకం

తొలిఅడుగు, జనగాం, జనవరి 11 : చేనేత కార్మికుల కష్టాన్ని గుర్తించి వారు ఆర్థికంగా ఎదగాలని,చేనేత వృత్తి అభివృద్ధి చెందాలని నేతన్న పొదుపు(త్రిఫ్ట్ ఫండ్),నేతన్న భీమా,నేతన్న భరోసా(40% సబ్సిడీ)అమలు చేస్తున్నటువంటి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేనేత జౌళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు చిత్రపాలకుకు స్థానిక వీవర్స్ కాలనీ 12 వ వార్డు నందు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు సామల పరమేశ్వర్, కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం పట్టణ అధ్యక్షులు బొంతపల్లి నాగరాజు, క్లస్టర్ చైర్మన్ కోడం శ్రీనివాస్ ,11 వ వార్డు అధ్యక్షులు యెనగందుల వెంకటేష్, సీనియర్ నాయకులు కొండ శ్రీనివాస్,యెనగందుల వెంకటేష్, బిర్రు సత్యనారాయణ,12 వ వార్డు యూత్ అధ్యక్షులు బత్తిని వెంకటేష్, బొంతపల్లి చిన్న, పల్ల శ్రీను, మంగళంపల్లి ఎల్లేష్, రచ్చ శ్రీనివాస్,బిర్రు రామకృష్ణ, బిర్రు శ్రీను,బీమనాధం హరీష్,వంగ సత్యనారాయణ, ఎనగందుల కృష్ణ,ఎనగందుల భాను, చక్రాల దేవానంద్,బత్తిని కిషోర్,గుమ్మడవెల్లి చైతన్య,బిట్ల చిన్న,కొండ కిరణ్, అనందాసు ఉదయ్, ఎనగందుల రాజు, బిట్ల శివ తదిదరులు పాల్గొన్నారు



# సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాడచీపురుపల్లి లో 28 వ రోజు మేలుకొలుపు కార్యక్రమం

తొలి అడుగు పరవాడ జనవరి 11: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాడచీపురుపల్లి పంచాయతీ గ్రామంలో శ్రీ సీతారాముల దేవాలయం కేంద్రంగా గ్రామ ధార్మిక జట్టు సభ్యులు సహకారం తో 28 వ రోజు మేలుకొలుపులు కార్యక్రమం చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూండ్రపు అప్పలనాయుడు (ఆర్ టి సి) మాట్లాడుతూ రెండు రోజులు మాత్రమే ఉన్నది ప్రతి ఇంటి నుంచి అందరూ రావాలని భక్తి భావంతో భగవంతుడు నామం చెప్తే మహా పుణ్యం చెప్పడం జరిగింది. నేడు స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం లో భాగంగా అందరూ పాల్గొని ఆ మహాపురుషుడిని మరొకసారి మనసారా తలుచుకొని స్వామి వివేకానంద మహానుభావుడు మార్గంలో యువత అంతా నడిచి దేశం కోసం ధర్మం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. దేవాలయ కేంద్రంగా భారత మాత పూజ ప్రతి గ్రామంలో గ్రామస్తులు అందరు సహకారంతో జరగాలని చెప్పారు. కూండ్రపు ముత్యాల నాయుడు పూజారి మాట్లాడుతూ భగవంతుని పల్లకిలో వీధి వీధికి వెళ్ళేటప్పుడు ఆ ఇంటిలో నుంచి ప్రతి ఒక్కరు వచ్చి భగవంతుని దర్శించుకుని ఈ ధనుర్మాసంలో భగవంతుని దర్శించుకోవడం వల్ల ఎంతో పుణ్యం వస్తుందని దానితోపాటు భగవంతుని నామం కలియుగంలో చెప్పడం మహా అద్భుత వరమని అలాగే దేవాలయానికి అందంగా భజన హారతి కార్యక్రమం నగర సంకీర్తన వారం వారం చేయాలని చెప్పడం జరిగింది. అధిక సంఖ్యలో యువతీ యువకులకు ఎక్కువగా రావాలని చెప్తూ స్వామి వివేకానంద చేసిన గొప్ప పని మన భారతదేశం ఉన్నత స్థితిలో నిలపడానికి ఎంతో కృషి చేసారని, అటువంటి మహానుభావుడిని ఆదర్శంగా తీసుకొని యువకులు గ్రామ గ్రామాన వివేకానంద యువసేన సమితిని ఏర్పాటు చేసుకొని అతను ఆశయాలతో దేశం కోసం ధర్మం కోసం మనం సంపాదించిన దాంట్లోఎంతో కొంత ఖర్చు పెట్టాలని చెప్పడం జరిగింది. యువతీ యువకులు కుటుంబంలో తల్లిదండ్రులను చూడడం మన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాతృమూర్తులు, పెద్దలు, గురువులు, యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు - సి.ఐ మల్లికార్జున

తొలి అడుగు పరవాడ జనవరి 11 : పరవాడ మండలం లోని అన్నీ గ్రామాల ప్రజలకు సంక్రాంతి పండుగ సందర్భంగా మీ గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు అనగా పేకాట, గుళ్లాట, బల్లాట మరియు కోడి పందాలు మొదలగున వాటికి పాల్పడిన మరియు బహిరంగంగా మద్యం సేవించడం, గొడవలకు పాల్పడడం చేసే వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొనబడును అని పరవాడ సి.ఐ మల్లికార్జున రావు తెలిపారు. పరవాడ పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరూ కూడా ఈ సంక్రాంతి పండుగ సందర్భంగా 24 గంటలు పరవాడ మండలంలోని ప్రతి గ్రామం మీద ప్రత్యేక నిఘా పెట్టి ఉన్నారని, కావున ప్రజలు కూడా స్వచ్ఛందంగా పైన తెలిపిన ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు మీ గ్రామంలో జరుగుతుంటే అట్టి వాటి గురించి సమాచారం తెలియజేయగలరని తెలిపారు. అదేవిధంగా పండగ సందర్భంగా వేరే గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు వారి యొక్క విలువైన వస్తువుల్ని తమతో పాటు తీసుకువెళ్లడం గాని లేదా తమ బంధువులు ఇంటి వద్ద విడిచిపెట్టడం గాని తప్పనిసరిగా చేయవలెను అని. ఈ పండగలలో దొంగలు ఎక్కువగా తిరిగే అవకాశం ఉన్నందున విలువైన వస్తువులను బాధ్యతగా భద్రపరుచుకోవాల్సిందిగా కోరుకుంటున్నట్లు సి.ఐ మల్లికార్జున రావు పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.



# రచయిత చిట్టిబాబును అరెస్ట్ చేయాలి

తొలి అడుగు పరవాడ జనవరి 11 : టీడీపీ రజక సాధికార కమిటీ సభ్యులు అడ్డురు శంకర్ రజకులను కించపరిసిన చిట్టిబాబును వెంటనే అరెస్ట్ చేయాలని అనకాపల్లి జిల్లా టీడీపీ రజక సాధికార కమిటీ సభ్యులు అడ్డురు శంకర్ డిమాండ్ చేసారు శుక్రవారం మండలకేంద్రంలో అయన విలేఖరలుతో మాట్లాడుతూ రజకులను కించపరిసిచే విధంగా మాట్లాడిన చిట్టిబాబును వెంటనే అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు ఇటీవల ఒక న్యూస్ ఛానల్ లో చిట్టి బాబు మాట్లాడుతూ పలుమార్లు చాకలి చాకలి అని రజక కులస్తులను ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా మాట్లాడినందుకుగాను రజకులందరు తీవ్రంగా వెతిరేకిస్తున్నామని మండిపడ్డారు. చిట్టిబాబు రజకులు ఆత్మగౌరవం దెబ్బ తినేవిధంగా మాట్లాడినట్టుందని అందుకు గాను ప్రభుత్వం చిట్టిబాబును అరెస్ట్ చేయాలని రజక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు ఎప్పటికీ చాకలి అనే పదం పై నిషేధం ఉన్నప్పటికీ బహిరంగ చర్చల్లో ఒక కులాన్ని ఉద్దేశించి పదే పదే కులం పై చెప్పడం బాధాకరంగా ఉందన్నారు రజకులపై కులం పేరుతో చెబుతూ చిన్నచూపు చూడ్డం తగదని ఇలాంటి కులం పదాలను వాడి అవమానించడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు చిట్టి బాబు చేసిన తప్పుకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# పల్లె పండుగ వారోత్సవాల్లో పాల్గొన్న పెందుర్తి శాసనసభ సభ్యులు శ్రీ పంచకర్ల రమేష్ బాబు

తొలి అడుగు పరవాడ జనవరి 11 : అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధులతో నాయుడుపాలెం పంచాయతీలో వెంకటపతి పాలెం, హస్తినాపురం, దండి నాయుడు గారు ఊర్లలో లలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు వీరితోపాటు పంచాయతీరాజ్ అధికారులు డిఈ మరియు జెఈ , నియోజవర్గం భారతీయ జనతా పార్టీ ఇంచార్జ్ గొర్లి రామానాయుడు , ఎంపీటీసీ సభ్యులు కొండ్రపు శ్రీరామమూర్తి , గ్రామ సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్య , కొండ్రపు మధుగారు,మండల పార్టీ అధ్యక్షులు చిన్న , బొద్దపు శ్రీనివాసరావు , పైలా మహాలక్ష్మి నాయుడు , పైలా అప్పలనాయుడు , పైలా శంకర్రావు , సన్యాసి నాయుడు ,మాజీ ఎంపీపీ సభ్యులు మాసరపు అప్పలనాయుడు , మాజీ జడ్పిటిసి సభ్యులు పైల జగన్నాధం, కన్నం నాయుడు గారు మరియు పరవాడ మండలం ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# సంపాదకీయం

తొలి ఎలక్ట్రానిక్ మాస్ మాధ్యమం

రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి. బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు "మార్కోనీ" కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. ఒకరోజు అర్ధరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది. మార్కొనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలిపైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు. క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మద్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే. వేల్స్ రాకుమారుడు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసు కోవాలని విక్టోరియా రాణి సంకల్పించింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం 150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మద్యంలో ఢీ కొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపోయే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మద్యంలో ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆపరేటర్ వైర్ లెస్ ద్వారా %యూా% సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించటానికి వీలైంది. 1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సందర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకి ప్రసారం చేసుకో గలిగారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు. 1908 జనవరి 22న చాలా దూర ప్రాంతాలకు రేడియో సందేశాలను ఈఫిల్ టవర్ నుండి మొట్టమొదటిసారి ప్రసారం చేశారు. మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతంగా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభ మైనాయి. 1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు. 1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారు చేసింది. బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది. ఆకాశవాణి ప్రపంచం లోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. దీని ప్రధాన కార్యాలయము కొత్త ఢిల్లీ లోని పార్లమెంటు వీధిలో భారత పార్లమెంటు ప్రక్కనే ఉన్న ఆకాశవాణి భవన్ లో ఉంది. ఆలిండియా రేడియో ప్రభుత్వ ఆధికారిక రేడియో ప్రసార సంస్థ. ఇది భారత ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ ఆధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతి యొక్క విభాగము. దూరదర్శన్ కూడా ప్రసార భారతిలో భాగమే. దేశాభివృద్ధిలో ప్రభుత్వాధీంలో ఉన్న రేడియో, అన్ని రంగాలలోను సమాచారాన్ని ఇస్తూ దేశ సమగ్రతకూ, అభివృద్ధికి ఎంతగానో ఉపయోగ పడుతోంది. ఆల్ ఇండియా రేడియో సేవలు దేశ వ్యాప్తంగా 420 స్టేషన్లను కలిగి, దేశ విస్తీర్ణంలో దాదాపు 92%, మొత్తం జనాభాలో 99.19%కి చేరు కుంటున్నది. 23 భాషలలో, 179 మాండలికాలలో ప్రసారాలు జరుగు తున్నాయి.


# టీటీడీ ఛైర్మన్ బి ఆర్ నాయుడు తక్షణమే రాజీనామా చేయాలి - కృష్ణం నాయుడు డిమాండ్



తొలి అడుగు పరవాడ జనవరి 11 : టీటీడీ ఛైర్మన్ బి ఆర్ నాయుడు తక్షణమే రాజీనామా చేయాలి ఉత్తరాంధ్ర బీసీ ఉపాధ్యక్షులు కే కృష్ణం నాయుడు డిమాండ్ చేశారు. తొక్కిసిలాట ఎవరు పాపం ఎవరు శాపం అని ధ్వజమెత్తారు. వైకుంఠ ఏకాదశి దర్శనానికి భక్తులు వస్తే ఏకంగా వైకుంఠనికి స్వామివారి భక్తులు మరణం బాధాకరం అని, వారి కుటుంబ సభ్యులకు తిరుమల ఏర్పాట్లలో లోపాలు లేకుండా సరి చూడాలి, వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలి, స్వామివారి వైకుంఠ ద్వార దర్శనం కోసం వచ్చిన భక్తుల తొక్కిసలాట కారణంగా ఆరుగురు భక్తులు మరణించడం అత్యంత బాధాకరమైన విషయం గాయపడిన వ్యక్తులకు మెరుగైన వైద్య సహాయం అందించాలిని, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, తిరుమల దేవస్థానంలో వారికి ఉద్యోగ అవకాసం కల్పించాలని, డిమాండ్ చేస్తూ, స్వామివారి దర్శనం కోసం లక్షలాది భక్తులు ముందుగా వస్తారని తెలిసిన ఎటువంటి బాధ్యత చర్యలు చేపట్టకపోవడం ఉమ్మడి కూటమి ప్రభుత్వం విఫలమైందని, తెలియపరుస్తూ టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అధికార పార్టీ పెద్దలు ప్రజా ప్రతినిధులు విఐపి సేవలో ఎక్కువగా పాల్గొనడం వల్ల ఈ తొక్కిసలాట జరిగిందని, ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు చూసుకోవాలి అని కోరారు.

# జాతి ఘనతను చాటిన మహోన్నతుడు

తొలిఅడుగు డెస్క్ : భారత దేశం ఔన్నత్యాన్ని విదేశాలకు చాటిచెప్పిన హిందూ సన్యాసి స్వామి వివేకానంద. తన భావాలను సమాజానికి పంచి, మేల్కొలిపిన మహామనిషి ఆయన. స్వదేశంలోనే కాక విదేశాలలోనూ తమ ఉపన్యాసాలతో జీవిత పరమార్థాన్ని బోధించి, ప్రజలను జాగృతం చేసిన ప్రాసం గి కుడు. వివేకానందుడు. పాశ్చాత్య దేశాలలో అడుగిడి, హిందూమత ప్రాశస్త్యాన్ని చాటి చెప్పిన మొట్ట మొదటి హిందూ సన్యాసి వివేకానందుడు. 1863 జనవరి 12న బ్రిటిష్ బెంగాలు ప్రెసిడెన్సీ లోని, పశ్చిమ బెంగాల్ నందలి నేటి కోల్కతాలో జన్మించాడు. నరేంద్ర నాథునిగా నామాంకితుడైన వివేకానందుడు, బాల్యం నుండి రోజూ ధ్యానం చేసేవాడు. సన్యాసుల పట్ల యోగుల పట్ల అమితమైన ప్రేమను చూపేవాడు. వారు ఏది అడిగినా ఇచ్చేవాడు. పువ్వు పుట్టగానే పరిమళం ఇస్తుందన్నట్లుగా చిన్ననాటినుండే, నిస్వార్థ గుణం ఆధ్యాత్మిక చింతనత అలవడ్డాయి. నరేంద్రుడు ఆట పాటలలో, చదువులో ముందుంటూ ఏకసంతాగ్రహిగా ఉండేవాడు. ఆయన జ్ఞాపక శక్తి అమోఘం. 1880 వరకు మెట్రిక్యులేషన్ పూర్తి చేసి కళాశాలలో చేరాడు. చరిత్ర, సైన్సు తోపాటు పాశ్చాత్య తత్వశాస్త్రాన్ని ఆపోసన పట్టి, రోజురోజుకు జ్ఞాన తృష్ణ పెరుగుతూ, దైవం గురించి తెలుసు కోవాలని ఆసక్తి కనబరిచే వాడు. మూఢ నమ్మకాలను విడిచి పెట్టినా, సత్యాన్ని కనుగొనలేక పోయాడు. తన సందేహాలకు పండితులతో వాదనలు సంతృప్తిని ఇవ్వలేక పోయాయి. రామకృష్ణ పరమహంస తాను భగవంతుని కనుగొని ఉన్నానని చెప్పగా నరేంద్రుడు విన్నాడు. ఒకసారి మిత్రులతో కలిసి ఆయనను కలవడానికి దక్షిణేశ్వర్ వెళ్ళాడు. రామకృష్ణుడు భగవంతుని సంభాషణలో శిష్యులతో సంభాషిస్తూ ఉన్నాడు. నరేంద్రుని దృష్టి ఆయనపై పడి, కొద్దిపాటి మానసిక కల్లోలానికి లోనై, పాత జ్ఞాపకాలు ఏవో తట్టి లేపుతున్న అనుభూతికి గురయ్యాడు. నరేంద్రుని ఆకర్షణీయమైన రూపాన్ని చూసిన రామకృష్ణుడు, ఆశ్చర్యచకితుడై నీవు పాడగలవా? అని ప్రశ్నించి, నరేంద్ర నోట రెండు బెంగాలీ ఈ పాటలు విని, తాదాత్మ్యం చెంది, నరేంద్రుని తన గదికి తీసుకెళ్లి భుజం తట్టి ఇంత ఆలస్యమైనది ఏమిటి? ఇన్ని రోజులుగా నీ కోసం చూసి చూసి అలసి పోతున్నా. నా అనుభవాలన్ని సరైన వ్యక్తితో పంచుకోవాలనుకున్నా. నీవు సామాన్యుడు కావు. సాక్షాత్తూ దివి నుండి భువికి దిగి వచ్చిన దైవ స్వరూపుడవు. అని కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు రామకృష్ణుడు. తర్వాత మీరు భగవంతుని చూశారా అని నరేంద్రుడు ప్రశ్నించాడు. అవును చూసాను. అవసరమైతే నీకు చూపించగలను అన్నాడు రామకృష్ణుడు. నెల దాటాక ఒకరోజు రామకృష్ణుడు మంచంపై విశ్రాంతి తీసుకుంటూ ఉండగా, పక్కన కూర్చోమన్నాడు. అలాగే ధ్యానం లోకి వెళ్లి, నరేంద్రుడి ఒడిలో తన కాలును ఉంచాడు. అంతే... నరేంద్రుడికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. నన్ను ఏమి చేస్తున్నారు? నా తల్లిదండ్రుల వద్దకు వెళ్లాలి, అన్న నరేంద్రుని చూసి ఈ రోజుకి ఇది చాలు. అని కాలును తీశాడు. రోజులు గడిచేకొద్దీ వారి మధ్య ఆకర్షణ అధికమై, విడిచి ఉండలేని స్థితికి చేరుకున్నారు. నరేంద్రుడు రామకృష్ణుని ముఖ్య శిష్యుడైనాడు. ఆయన చెప్పిన అన్నింటితో ఏకీభవించే వాడు కాదు. ఎప్పటికప్పుడు నరేంద్రుని రామకృష్ణుడు దారికి తెచ్చేవాడు. నెమ్మదిగా ప్రాపంచిక సుఖాలపై వ్యామోహం తగ్గి, సన్యాసత్వం వైపు మొగ్గు చూపాడు. తండ్రి మరణించగా విద్యాసాగర్ పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిలో చేరాడు. గురువుకు గొంతు క్యాన్సర్ సోకి ఆరోగ్యం క్షీణించింది. ఉద్యోగం మాని, గురువు శుశ్రూషలో నిమగ్నమయ్యాడు. మరణించ బోయే రోజున నరేంద్రుని పిలిచి, మృదువుగా తాకాడు. ఆధ్యాత్మిక శక్తులన్నీ శిష్యునికి ధారపోశాడు. రామకృష్ణుని మరణానంతరం, గంగా నది తీరాన రామకృష్ణ మఠాన్ని స్థాపించాడు నరేంద్రుడు. మిగిలిన శిష్యులతో కలసి సన్యాసిగా మారి, ఆ మఠానికి నాయకుడయ్యాడు, అలా "వివేకానందుడు" అయినాడు. భారతదేశం గృహంగా, ప్రజలను సోదరులుగా భావించాడు. ఆస్తి అంతా ఒక కాషాయ వస్త్రం, కమండలం, శిష్యులు కలిగి, దేశమంతా పర్యటించాడు. పుణ్యక్షేత్రాలను సందర్శించాడు. నేలమీద నిద్రించాడు. ఆధ్యాత్మిక చర్చలతో కాలం గడిపాడు. మైసూరు మహారాజుతో పరిచయం కలిగి, పండితుల సభలో ఆయన చేసిన సంస్కృత ప్రసంగం మంత్ర ముగ్ధులను చేసింది. అమెరికా వెళ్లి వేదాంతాన్ని ప్రచారం చేసేందుకు, మహారాజు ఖర్చులు భరిస్తానన్నాడు. భాస్కర సేతుపతి పాలిత రామనాడును సందర్శించాడు. రామేశ్వరానికి వెళ్లి చివరకు కన్యాకుమారి చేరాడు. పాశ్చాత్య దేశాలకు వెళ్ళి, అక్కడ భారతదేశపు ఆధ్యాత్మిక విలువలను వారికి వివరించడం ప్రథమ కర్తవ్యంగా భావించాడు. దేశం నలుమూలల నుండి విరాళాలు సేకరించి, ప్రయాణానికి అవసరమైనవి తీసుకొని, 1893 మే 31 న బొంబాయి తీరం నుండి నౌకాయానం చేసి జూలైలో చికాగో చేరుకున్నాడు. ఒక మహిళ పరిచయం కాగా ఆమె ఇంట బస చేశాడు. హిందూ ధర్మం భారతీయ సంస్కృతిపై చిన్న సభలలో ప్రసంగాలు చేశాడు. హార్వర్డ్ విశ్వవిద్యాలయ గ్రీకు విభాగంలో ఆచార్యుడు జాన్ హెన్రీ రైట్ పరిచయ మయ్యాడు. 1893 సెప్టెంబర్ 11న, చికాగో సదస్సు ప్రారంభమైంది. అక్కడ చేరిన ప్రతినిధులలో ఆయన ఆయన చిన్నవాడు. ఉపన్యాసానికి ముందు సరస్వతి దేవిని, గురువును ప్రార్థించాడు. "అమెరికా దేశపు సోదరులారా" అని మధుర కంఠస్వరంతో అనగానే, సభ మూడు నిమిషాలు చప్పట్లతో మార్మోగింది. సమావేశానికి హాజరైన ప్రతివారు. ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు. వార్తా పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. అక్కడి ప్రజలకు ఆరాధ్యుడయ్యాడు. అనతి కాలంలోనే స్వామీజీకి ప్రపంచ ప్రఖ్యాతి లభించింది. వాదనలో ఆయన్ను గెలిచే వారే లేకుండెను. హిందూ మతాన్ని వివరించ గల నైపుణ్యం, వికాస వంతమైన వ్యక్తిత్వంతో, హృదయాలను గెలవ గలిగాడు. స్వామీజీ వల్ల అభివృద్ధి చెందిన దేశాలన్నింటిలో, భారత దేశ గౌరవం పెరిగింది. ఎందరో శిష్యులైనా, ముఖ్యంగా మార్గరెట్ నోబుల్ అనే "సిస్టర్ నివేదిత" భారత దేశానికి వచ్చి ఉండి పోయింది. 1897 జనవరి 15 న మద్రాసు చేరాక రథం మీద ఊరేగించారు. "వ్యక్తి మోక్షమునకు, ప్రపంచ హితమునకు" అనే



నినాదంతో, 1897 లో రామకృష్ణ మఠాన్ని స్థాపించాడు. భవనాలను నిర్మించాడు. ఆయన నేర్పిన ముఖ్యాంశాలలో "జీవుడే దేవుడు" అనేది మంత్రంగా మారింది. పేదవారికి సేవను "దరిద్ర నారాయణ సేవ" గా ప్రతిపాదించాడు. రాను రాను అంతర్ముఖుడైనాడు. 1902 జూలై 4న యథా విధిగా శిష్యులకు బోధనలు చేశాడు. ఉల్లాసంగా గడిపి, రాత్రి తొమ్మిది గంటల సమయాన చిన్నగా అరిచి, లేచి కూర్చొని, దీర్ఘంగా శ్వాస పీల్చి, నెమ్మదిగా శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు. "అందరూ అనుకుంటే నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది". అనే వేదాంత తత్వానికి చెందిన మహా మనీషి వివేకానందుడు. సిద్ధాంతాలు, పిడి వివాదాలు, సంప్రదాయాలు, దేవాలయాలు, మొదలైన వాటి గురించి ఆలోచించకు. మనిషి హృదయాలలో దేదీప్య మానమైన ఆత్మతో పోలిస్తే ఎందుకూ అవి కొరగావు. ఆ వస్తువే "ఆధ్యాత్మిక శక్తి". దాన్ని మొదట సముపార్జించాలి. ప్రతి మతంలో సిద్ధాంతాల్లో ఎంతో కొంత మంచి ఉంటుంది. వాస్తవానికి అన్ని మతాలు ఒకే సనాతన ధర్మం యొక్క అంశాలు. మందలో ఉండకు. వందలో ఉండేందుకు ప్రయత్నించు ప్రయత్నం చేసి ఓడిపో, కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఉండిపోకు. మీ సహచరులకు నాయకత్వం వహించే తలంపు వద్దు. వారికి మీ సేవలు అందించాలి. ఇలా ఎన్నెన్నో హితవచనాలు బోధించాడు. భారత ప్రభుత్వం వివేకానందుని జన్మదినాన్ని, "జాతీయ యువజన దినోత్సవం"గా 1994 లో ప్రకటించింది. అటువంటి మనీషి యుగానికి ఒకరే పుడతారు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# డాలర్ దెబ్బకు కరిగిపోతోన్న విదేశీ మారకం నిల్వలు




తొలిఅడుగు డెస్క్: ప్రపంచ మార్కెట్‌లో రోజు రోజుకు రూపాయికి విలువ లేకుండా పోతోంది. తాజాగా డాలర్‌తో రూపాయి మారకం విలువ 86కు క్షీణించి.. దేశ చరిత్రలోనే అత్యంత కనిష్ట స్థాయిని చవి చూసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో తడబడుతున్న రూపాయిని నిలబెడుతామని 2014 ఎన్నికలకు ముందు నరేంద్ర మోడీ ఇచ్చిన వాగ్దానాలకు.. ప్రస్తుత వాస్తవ పరిస్థితులు తీవ్ర భిన్నంగా ఉన్నాయి. పదేండ్ల క్రితం డాలర్‌తో రూపాయి మారకం విలువ 64 దిగువన ఉండగా.. ప్రస్తుతం ఈ విలువ అమాంతం పడిపోవడం తీవ్ర ఆందోళనకరం. శుక్రవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు పతనమై 86కు పరిమితమయ్యింది. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో 85.88 వద్ద తెరుచుకున్న రూపాయి విలువ.. ఇంట్రాడేలో స్వల్పంగా పుంజుకుని 85.85 వద్ద ట్రేడింగ్ కాగా.. తుదకు 14 పైసలు కోల్పోయి 86 వద్ద ముగిసింది. గురువారం సెషన్‌లోనూ 17 పైసలు తగ్గి 85.86 వద్ద నమోదయ్యింది. భవిష్యత్తు సమీపంలో మరింత పతనమయ్యే అవకాశాలున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో దిగుమతులు, విదేశీ అప్పు చెల్లింపులు, వాణిజ్య చెల్లింపులు తీవ్ర భారం కానున్నాయి. దేశీయంగా ద్రవ్యోల్బణం పెరగనుంది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, ఇతర దేశీయ బలహీన ఆర్థికాంశాలు రూపాయి విలువను ఒత్తిడికి గురి చేస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర 1.96 శాతం పెరిగి 78.43 డాలర్ల వద్ద ట్రేడింగ్ అయ్యింది. వారాంతం సెషన్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 241.30 పాయింట్లు లేదా 0.31 శాతం నష్టంతో 77,378.91కి పడిపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 95 పాయింట్లు లేదా 0.40 శాతం తగ్గి 23,431 వద్ద ముగిసింది. దీంతో వరుసగా మూడు రోజులు నష్టాలు చవి చూసినట్లయ్యింది. ఎఫ్ఐఐలు వరుసగా తరలిపోవడానికి తోడు భారత విదేశీ మారకం నిల్వలు వరుసగా ఐదో వారంలోనూ కరిగిపోయాయి. జనవరి 3తో ముగిసిన వారంలో 5.7 బిలియన్ డాలర్లు తరిగిపోయి 634.58 బిలియన్ డాలర్లకు పరిమితమయినట్లు ఆర్బీఐ వెల్లడించింది. ఇది 10 నెలల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. ఇంతక్రితం నాలుగు వారాల్లో 17.8 బిలియన్ డాలర్లు క్షీణించాయి. 2024 సెప్టెంబర్‌లో ఆల్‌టైం గరిష్ట స్థాయి 704.89 బిలియన్ డాలర్లుగా ఉన్న మారకం నిల్వలు.. అప్పటి నుంచి దాదాపు 70 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.6 లక్షల కోట్లు) విలువ చేసే విదేశీ మారకం నిల్వలు తగ్గిపోయాయంటే పరిస్థితి తీవ్రత స్పష్టమవుతోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో చిక్కుకోనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# వచ్చే రెండేళ్లలో 50 అమృత్ భారత్ రైళ్ల తయారీ



తొలిఅడుగు డెస్క్: భారతీయ రైల్వే ప్రయాణికుల కోసం ఎన్నో రకాల సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తోంది. పేద కుటుంబాలు తక్కువ ధరల్లో ఎక్కువ దూరం ప్రయాణించే విధంగా కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వచ్చే రెండేళ్లలో 50 వరకు అమృత్ భారత్ రైళ్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. వచ్చే రెండేళ్లలో ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో 50 అమృత్ భారత్ రైళ్లను తయారు చేయనున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం తెలిపారు. అమృత్‌భారత్ వెర్షన్ 2.0 రైళ్లలో కొత్తగా 12 రకాల మార్పులు చేపట్టినట్లు తెలిపారు. దీని నిర్మాణ సమయంలో పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్నట్లు చెప్పారు.ఉంచుకుంటారు. ఈ మేరకు చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ సుబ్బారావుతో కలిసి శుక్రవారం కోచ్ ఫ్యాక్టరీని సందర్శించారు. అమృత్ భారత్ రైళ్లతో పాటు, వందేభారత్ 2.0 స్లీపర్ రైళ్ల తయారీని పరిశీలించారు. అలాగే తమిళనాడు ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలని అన్నారు. కేంద్రం, ఆయన మంత్రిత్వ శాఖ ప్రజల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. కాగా, అమృత్ భారత్ మొదటి ఎడిషన్‌ను 2024 జనవరిలో ప్రధాని మోదీ ప్రారంభించారు. అమృత్ భారత్ రెండో ఎడిషన్ రైళ్లను ఇక్కడ తయారు చేయడం చాలా ఆనందంగా ఉందని, గత ఒక సంవత్సరం అనుభవం ఆధారంగా, అమృత్ భారత్ రెండవ ఎడిషన్‌లో అనేక రకాల మార్పు చేర్పులు చేస్తున్నట్లు చెప్పారు. సెమీ ఆటోమేటిక్ కప్లెట్స్, మాడ్యులర్ టాయిలెట్స్, ఎమర్జెన్సీ టాక్ బ్యాక్ ఫీచర్, ఎమర్జెన్సీ బ్రేక్ సిస్టమ్, వందే భారత్ రైళ్ల తరహాలో నిరంతరం వెలిగే లైట్లు, ఛార్జింగ్ పోర్టులతో పాటు బెర్తుల డిజైన్ కూడా మార్చినట్లు వెల్లడించారు. ప్యాంట్రీ కారును సమూలంగా మార్చినట్లు తెలిపారు. అయితే తక్కువ ఖర్చుతో దూర ప్రాంతాలకు వెళ్లే వారికి మెరుగైన ప్రయాణ సౌకర్యాన్ని అందించడమే తమ లక్ష్యమని వెల్లడించారు. అమృత్ భారత్ రైళ్లలో చేపడుతున్న మార్పుల గురించి ఎక్స్‌లో ఖాతాలో ఓ పోస్టు కూడా చేశారు మంత్రి.

# బ్యాంకు బ్యాలెన్స్ చెకింగ్ కోసం పిన్ నమోదు చేస్తున్నారా?



తొలిఅడుగు డెస్క్: ఉపయోగిస్తున్నప్పుడు, ఏదైనా తెలియని వ్యక్తి నుండి వచ్చే డబ్బు, అభ్యర్థనల గురించి జాగ్రత్తగా ఉండండి. మోసపూరిత లావాదేవీలను నివారించడానికి, ఎల్లప్పుడూ తెలివిగా వ్యవహరించండి. మీ పిన్‌ను గోప్యంగా ఉంచండి. ఇలాంటి సంఘటనలపై వెంటనే సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి. ఇప్పుడున్న రోజుల్లో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎందుకంటే ఎటు నుంచి ఎలాంటి మోసం వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. మొబైల్‌కు ఏదైనా మెసేజ్ వచ్చినా, రోజురోజుకు పెరుగుతున్న టెక్నాలజీతో పాటు కొత్త కొత్త స్కామ్‌లు కూడా పుట్టుకొస్తున్నాయి. ముఖ్యంగా కేవైసీ పేరుతో ఎన్నో మోసాలు జరుగుతున్నాయి. యూపీఐ, నెట్ బ్యాంకింగ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత బ్యాంక్‌కి వెళ్లే పని తప్పింది. అందరూ ఇంట్లోనే ఉండి మొబైల్స్ ద్వారానే రకరకాల లావాదేవీలు చేస్తున్నారు. దీంతో సైబర్ నేరాలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. వాటిని అరికట్టడానికి ఎన్న జాగ్రత్తలు తీసుకుని, ఎంతగా అవగాహన పెంచుతున్నా.. సైబర్ మోసగాళ్లు కొత్త మార్గాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా జంప్డ్ డిపాజిట్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. ఈ పద్ధతిలో సైబర్ దుండగులు ముందుగా యూపీఐ ద్వారా తమ బాధితుడి బ్యాంకు ఖాతాకు డబ్బు పంపుతారు. డబ్బు జమ అయినట్లు మెసేజ్ వచ్చిన వెంటనే చాలా మంది తమ బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేసుకుంటారని వారికి తెలుసు. డబ్బు అందుకున్న తర్వాత బాధితుడు తన బ్యాలెన్స్ తనిఖీ చేయడానికి పిన్‌ను నమోదు చేసిన వెంటనే, అతని ఖాతా నుండి డబ్బు విత్‌డ్రా అయిపోతుంది. అంటే పిన్ నెంబర్‌ను ఎంటర్ చేయగానే ఆ వ్యక్తికి సంబంధించిన ఖాతాను దుండగులు యాక్సెస్ చేసేస్తారు. అంటే మీకు తెలియకుండానే ఇదంతా జరిగిపోతుంది. మీ బ్యాంకు ఖాతా యాక్సెస్ వారి చేతిలోకి వెళ్లిన తర్వాత అకౌంట్లో ఉన్న డబ్బంతా వారి ఖాతాకు బదిలీ చేసుకుంటారు. ఇలాంటి ఘటన తమిళనాడులో జరిగింది. ఈ స్కామ్‌పై అక్కడి పోలీసులు అలర్ట్ ప్రకటించారు. అంతేకాకుండా, ఈ స్కామ్‌పై నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో కూడా చాలా ఫిర్యాదులు నమోదయ్యాయి. ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు యూపీఐ ద్వారా మీ ఖాతాకు డబ్బు పంపితే, మీరు జాగ్రత్తగా ఉండాలని తమిళనాడు పోలీసులు చెబుతున్నారు.


# భారత జిడిపి 6.6 శాతానికి మందగింపు




తొలిఅడుగు డెస్క్: ప్రస్తుత ఏడాది 2025లో భారత జిడిపి 6.6 శాతానికి మందగించే అవకాశాలున్నాయని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. 2024లో 6.9 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. వచ్చే 2026లోనూ 6.7 శాతానికే పరిమితం కావొచ్చని తన 'ప్రపంచ ఆర్థిక పరిస్థితి మరియు అంచనా రిపోర్ట్'లో విశ్లేషించింది. అదే జరిగితే వరుసగా మూడేళ్లలో ఏడు శాతం లోపే వృద్ధి చోటు చేసుకోనుంది. కరోనా తర్వాత 2023లో 8 శాతం వృద్ధి నమోదయ్యింది. 'కోవిడ్ సంక్షోభం తర్వాత తగ్గిన డిమాండ్ కారణంగా గత మూడు సంవత్సరాలలో భారత్ అధిక జిడిపి వృద్ధిని నమోదు చేసిందని ఐక్యరాజ్యసమితి ఆసియా, పసిఫిక్ ఆర్థిక, సామాజిక కమిషన్ (యుఎన్ఇఎస్‌సిఎపి) మాజీ డైరెక్టర్ నగేష్ కుమార్ అన్నారు. తాజాగా తిరిగి కోవిడ్ పూర్వ ధోరణికి తిరిగి వచ్చామన్నారు. ఇటీవల కేంద్ర గణంకాల శాఖ అధికారికంగా వెల్లడించిన రిపోర్ట్ ప్రకారం.. జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత జిడిపి 5.4 శాతానికి క్షీణించింది. ఇది దాదాపు రెండేళ్ల కనిష్ట స్థాయి. తయారీ కార్యకలాపాలు పేలవంగా ఉండటం వల్ల జిడిపి భారీగా తగ్గింది. ఈ స్థాయి వృద్ధి తగ్గుదలను అంచనా వేయలేదని ఆర్‌బిఐ ఎంపిసి సభ్యుడు అయినా నగేష్ కుమార్ అశ్చర్యం వ్యక్తం చేశారు. ఆర్థిక వృద్ధి మందగించడానికి ప్రయివేటు పెట్టుబడి నెమ్మదించడమే ప్రధాన కారణమన్నారు. అధిక వడ్డీ రేట్లు కూడా ఓ కారణం కావొచ్చన్నారు. ద్వితీయార్థంలో జిడిపి పుంజుకునే అవకాశాలున్నాయన్నారు. ప్రపంచ వృద్ధి రేటులోనూ స్తబ్దత చోటు చేసుకోవచ్చని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. ప్రస్తుత ఏడాది 2025లో ప్రపంచ వృద్ధి రేటు 2.8 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. 2024లోనూ ఇదే స్థాయిలో చోటు చేసుకుందని ముందస్తు అంచనా వేసింది. ఇప్పటికీ అనిశ్చితి పెద్ద ఎత్తున ఉందని తెలిపింది. ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో భౌగోళిక రాజకీయ సంఘర్షణలు, పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు, పెరిగిన రుణ వ్యయాల నుండి వచ్చే ప్రమాదాలు పొంచి ఉన్నాయని విశ్లేషించింది. ఈ సవాళ్లు ముఖ్యంగా తక్కువ ఆదాయం, దుర్బల దేశాలపై తీవ్ర ప్రతికూలతను చూపనున్నాయని విశ్లేషించింది. ఈ పరిణామాలు ప్రపంచ అభివృద్ధి పురోగతిని దెబ్బతీయనున్నాయని హెచ్చరించింది.

# ఇటిఎఫ్‌లో ఎందుకు పెట్టుబడి పెట్టాలి?

తొలిఅడుగు డెస్క్: ఏదైనా పెట్టుబడి పెట్టే ముందు దాని రాబడిని తనిఖీ చేస్తాము. రిటర్న్స్ కాకుండా, పరిగణనలోకి తీసుకోవలసిన అనేక ఇతర అంశాలు ఉన్నాయి. అటువంటి పరిస్థితిలో ఋఖీని ఎంచుకునే సమయంలో మీరు దాని ప్రయోజనాల గురించి తెలుసుకోవాలి. మీరు ఏదైనా పెట్టుబడి పెట్టే ముందు దాని నుండి మీకు ఎంత లాభం వస్తుందో చూడటం చాలా ముఖ్యం. లాభం కాకుండా మనం అనేక ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఋఖీలలో ఇన్వెస్ట్ చేసేటప్పుడు తెలుసుకోవలసిన అనేక విషయాలు ఉన్నాయి. ఈటీఎఫ్‌లలో పెట్టుబడి పెట్టే మొత్తం పెరుగుతూనే ఉంది. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ చాలా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. మీరు ఈటీఎఫ్‌లలో పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తున్నారా? మీరు ఈటీఎఫ్‌లో ఎందుకు పెట్టుబడి పెట్టాలి? దాని ప్రయోజనాలు ఏమిటి? మొదలైన వాటిని తెలుసుకోవడం మంచిది. ఇటిఎఫ్ లేదా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ అనేది ఇండెక్స్‌ను ట్రాక్ చేసే మ్యూచువల్ ఫండ్ లాంటిది. ప్రధాన వ్యత్యాసం ఏమిటంటే ఇది పాసివ్ ఫండ్, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో షేర్ల వలె ట్రేడింగ్ చేయవచ్చు. ఋఖీ లలో పెట్టుబడి పెట్టడానికి అనేక కారణాలను పేర్కొనవచ్చు. ఇటిఎఫ్‌ని కొనుగోలు చేయడం ద్వారా మీరు ఒకటి కాదు అనేక కంపెనీల షేర్లలో పెట్టుబడి పెడతారు. ఉదాహరణకు, చీఱట్ఎ50 ఋఖీ ఆ సూచికను ట్రాక్ చేస్తుంది. మీరు నిఫ్టీ50 ఇటిఎఫ్‌ని కొనుగోలు చేసినప్పుడు ఆ ఇండెక్స్‌లోని 50 స్టాక్‌లకు వాటి వెయిటేజీ ఆధారంగా పెట్టుబడి కేటాయించబడుతుంది.



# అవిసె గింజలతో ఆరోగ్యమే కాదు !

తొలిఅడుగు, ఆరోగ్యం :అవిసె గింజలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని మనందరికీ తెలిసిందే. అందుకే ఇటీవలి కాలంలో వీటి వినియోగం బాగా పెరిగింది. అవిసె గింజలు ఆరోగ్యానికి కావాల్సిన మంచి పౌష్టిక విలువలను కలిగి ఉంటాయి. ఇవి చర్మ సౌందర్యానికి కూడా మేలు చేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మెరిసే చర్మం కోసం అవిసె గింజలతో ఫేస్ ప్యాక్ ప్రయత్నించండి. ఇది అనేక చర్మ సమస్యలను తగ్గిస్తుందని చెబుతున్నారు. ఫ్లాక్‌సీడ్స్ ఫేస్‌ప్యాక్‌తో చర్మం మెరిసిపోవడమే కాకుండా డార్క్ స్పాట్స్, పిగ్మెంటేషన్ తగ్గుతుంది. అవిసె గింజలు ఆరోగ్యానికి కాదు అందానికి కూడా అద్భుతంగా పనిచేస్తాయి. ఇందులో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్య, సౌందర్యానికీ సహాయపడతాయి. ఇవి చర్మానికి తగినంత తేమను అందించి చర్మాన్ని కోమలంగా మారుస్తాయి. చర్మకణాలలో పేరుకుపోయిన మురికిని తొలగించి చర్మాన్ని తాజాగా ఉంచుతుంది. చర్మం పై మొటిమలు, మచ్చలు, ముడతలను తగ్గించి చర్మ నిగారింపును పెంచుతాయి. కెమికల్ ఫేషియల్ చేసుకునే బదులు ఇంట్లోనే నేచురల్ అండ్ కెమికల్ ఫ్రీ ఫేషియల్ చేయించుకోవడం మంచిది. ఇందుకోసం ఒక చెంచా అవిసె గింజలను నీటిలో నానబెట్టి, ముఖంపై సున్నితంగా అప్లై చేసి 2-3 నిమిషాల పాటు మసాజ్ చేసుకోవాలి.. ఇది చర్మాన్ని లోతుగా శుభ్రపరుస్తుంది. ముఖంలోని మురికిని తొలగిస్తుంది. అవిసె గింజల పొడిలో కొద్దిగా పెరుగు కలిపి స్క్రబ్‌లా తయారు చేసుకోవాలి. ఈ స్క్రబ్‌ను ముఖంపై సున్నితంగా అప్లై చేసి వృత్తాకారంలో మసాజ్ చేసుకోవాలి. దీని వాడకంతో డెడ్ స్కిన్ తొలగిపోయి చర్మం మృదువుగా కనిపిస్తుంది. అవిసె గింజలతో మరో విధంగా కూడా అందాన్ని పెంచుకోవచ్చు.. ఇందుకోసం ఒక పాత్రలో వేడి నీటిని తీసుకుని అందులో అవిసె గింజలను వేయాలి. ఆ వేడినీటి నుండి వచ్చే ఆవిరిని ముఖానికి పట్టించాలి. ఇది చర్మ రంధ్రాలను తెరుచుకునేలా చేస్తుంది. చర్మాన్ని లోతుగా శుభ్రపరుస్తుంది. ఫేస్ మాస్క్ కూడా తయారు చేసుకోవచ్చు..ఇందుకోసం ఫ్లాక్స్ సీడ్స్ జెల్‌లో తేనె, కొంచెం రోజ్ వాటర్ కలపాలి. దీన్ని ముఖానికి బాగా పట్టించి 15 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఈ మాస్క్ చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. చర్మాన్ని బిగుతుగా చేస్తుంది. ముఖానికి నేచురల్ గ్లో ఇస్తుంది. ఫ్లాక్స్ సీడ్స్ ఫేషియల్ ముఖానికి మంచి టోనింగ్‌గా పనిచేస్తుంది. దీని కోసం ఫ్లాక్స్ సీడ్స్ నీటిని స్ప్రే బాటిల్‌లో నింపి ముఖంపై స్ప్రే చేయాలి. ఇది చర్మాన్ని చల్లబరుస్తుంది. తెరుచుకున్న రంధ్రాలను మూసివేస్తుంది. చర్మాన్ని తాజాగా ఉంచుతుంది.



# షుగర్ ఉన్నవాళ్లు మటన్ తినొచ్చా..

తొలిఅడుగు, ఆరోగ్యం :భారత దేశంలో ప్రతీ ఐదుగురిలో ఇద్దరికి ఖచ్చితంగా షుగర్ వ్యాధి అనేది ఉంటుంది. లైఫ్ స్టైల్‌లో మార్పులు, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా డయాబెటీస్ అనేది ఉంటుంది. మధు మేహం ఉన్నవారు తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ఈ వ్యాధి అస్సలు కంట్రోల్ అవ్వదు. ప్రస్తుత కాలంలో చాలా మంది అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వీటిల్లో డయాబెటీస్ కూడా ఒకటి. షుగర్ వ్యాధి అనేది దీర్ఘకాలిక వ్యాధి. ఒక్కసారి వచ్చిందంటే జీవితాంతం బాధ పడుతూ ఉండాల్సిందే. ఈ వ్యాధికి ఇంకా సరైన మందు లేదు. కేవలం ఆహారంతో మాత్రమే కంట్రోల్ చేసుకోవాలి. షుగర్ ఉన్నవారు ఆహారం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. దీని వలన రక్తంలో షుగర్ లెవల్స్ అనేవి పెరగకుండా ఉంటాయి. ఇలా డయాబెటీస్ వచ్చిన వాళ్లు మటన్‌కి కూడా దూరంగా ఉండాల్సిందే. ఎందుకంటే మటన్‌లో శాచురేటెడ్ ఫ్యాట్ ఉంటుంది. దీని వలన షుగర్ లెవల్స్ అనేవి మరింతగా పెరుగుతాయి. మటన్ శరీరంలో బ్యాడ్ కొలెస్ట్రాల్‌ని పెంచుతుంది. కాబట్టి ఎలాంటి వ్యాధి లేనివాళ్లు అయినా మటన్ తక్కువ మోతాదులోనే తీసుకుంటేనే ఆరోగ్యం. షుగర్ వచ్చినవాళ్లు మటన్‌కి బదులు చికెన్, చేపలు తినవచ్చు. ఇవి కూడా తక్కువ మోతాదులో తీసుకోవాలి. లేదంటే షుగర్ లెవల్స్ పెరుగుతాయి. డయాబెటీస్ ఉన్నవారు నాన్ వెజ్ తక్కువగా తీసుకోవాలి. కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు ఇవి కూడా మితంగా తీసుకుంటూ ఉండే మధుమేహాన్ని కంట్రోల్ చేసుకోవచ్చు. అంతే కాదు ఇవి శరీరానికి శక్తిని కూడా ఇస్తాయి. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామాలు చేసినా షుగర్‌ని కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు.



# ఒకే ఒక్క తమల పాకుతో ఎన్నో సమస్యలకు చెక్..



తొలిఅడుగు, ఆరోగ్యం : మనకు ఈజీగా లభించే వాటిల్లో తమల పాకులు కూడా ఒకటి. తమల పాకులను సంప్రదాయానికి చిహ్నంగా వాడతారు. ఎలాంటి ఫంక్షన్స్, పెళ్లిళ్లు, పూజలకు తమల పాకులే ముందు ఉండాలి. కానీ తమల పాకులతో ఎన్నో అనారోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్త పడొచ్చు.. ఇంట్లో ఎలాంటి ఫంక్షన్స్ అయినా, పెళ్లిళ్లు అయినా, గుడికి వెళ్లినా, పూజలు చేసినా తమల పాకులు ఉండాల్సిందే. తమల పాకులు సంప్రదాయానికి పెట్టింది పేరు. తమల పాకు లేకుండా ఎలాంటి పేరంటం ఇవ్వరు. కనీసం ఒక ఆకు అయినా పేరంటంలో కలిపి ఇస్తారు. కేవలం ఇది ఆకు అనుకుంటే మాత్రం పొరపాటే. ఈ ఆకులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. తమల పాకుతో ఎన్నో సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. తమల పాకును పాక్ ఆకు అని పిలుస్తారు. ఇంతకు ముందు పెళ్లిళ్లు, ఫంక్షన్స్‌లో పాన్ ఇచ్చేవారు. ఇప్పటికీ ఆ సంప్రదాయం కొనసాగుతుంది. భోజనం చేసిన తర్వాత తమల పాకు నమిలి తింటే ఎంతో ఆరోగ్యమని పెద్దలు కూడా చెబుతూ ఉంటారు. తమల పాకు తినడం వల్ల చర్మం, జుట్టు, మొత్తం శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులో అనేక యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి అనేక సమస్యలు రాకుండా అడ్డుకుంటాయి. నోటి ఆరోగ్యాన్ని, ఒత్తిడిని తగ్గించడంలో, జీర్ణ క్రియ మెరుగు పరచడంలో, చర్మ ఆరోగ్యం, జుట్టు ఆరోగ్యం, డయాబెటీస్ కంట్రోల్, గాయాలను నయం చేయడంలో ఇలా అనేక రకాలుగా తమల పాకు ఉపయోగ పడుతుంది.

# ఈ ఆకుల్ని ఇలా వాడారంటే.. కిడ్నీల్లో రాళ్లను కరిగించేస్తాయి..



తొలిఅడుగు, ఆరోగ్యం : ఈ మధ్య కాలంలో కిడ్నీల్లో రాళ్ల సమస్యలతో బాధ పడేవారి సంఖ్య బాగా పెరుగుతుంది. సరైన ఆహారం, నీటిని తీసుకోని కారణంగా కిడ్నీల్లో రాళ్లు ఏర్పడతాయి. ఈ రాళ్లు అంత త్వరగా కరగవు. ఈ సమస్యను మందులు, శస్త్ర చికిత్సతోనే కాకుండా.. ఈ ఆకులతో కూడా తగ్గించుకోవచ్చు. ప్రస్తుత కాలంలో అనేక ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఏదో ఒక సమస్యతో జనం ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది కిడ్నీలకు సంబంధించిన సమస్యలతో బాధ పడుతున్నారు. అనేక కారణాల వల్ల కిడ్నీల రాళ్లు వస్తున్నాయి. కిడ్నీల్లో రాళ్లు ఏర్పడితే.. చాలా నొప్పిగా ఉంటుంది. ఈ నొప్పిని భరించడం చాలా కష్టం. మందులతోనే కాకుండా పలు రకాల ఆహారాలు తీసుకోవడం వల్ల కూడా కిడ్నీల్లో రాళ్ల సమస్యను తగ్గించుకోవచ్చు. ఇందుకు బిర్యానీ ఆకు ఎంతో చక్కగా పని చేస్తుంది. బిర్యానీ ఆకుతో ఎన్నో రకాల సమస్యలు రాకుండా చేసుకోవచ్చు. బిర్యానీ ఆకులు వేసి మరిగించిన నీటిని తాగడం వల్ల మూత్ర పిండాల్లో రాళ్లను కరిగించుకోవచ్చు. నొప్పి నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. బిర్యానీ ఆకుల్ని చిన్న ముక్కలుగా కట్ చేసి.. టీ రూపంలో కూడా తయారు చేసుకుని తాగవచ్చు. బిర్యానీ ఆకులు వేసి మరిగించిన నీటిని టీ రూపంలో కూడా సేవించవచ్చు. కావాలంటే ఇందులో తేనె కలుపుకుని తాగవచ్చు. బిర్యానీ ఆకులను ఎండబెట్టి పొడిలా చేసి కూడా వేడి నీటిలో వేసి మరిగించి తీసుకున్నా మంచి ఉపశమనం పొందుతారు. ఈ నీటిని తరచూ తాగితే.. శస్త్ర చికిత్స అవసరం లేకుండా రాళ్లు కరిగిపోతాయి.

# బెల్లంతో చేసిన లడ్డూలు ఆరోగ్యమా?



తొలిఅడుగు, ఆరోగ్యం : చలికాలంలో నువ్వులు, బెల్లంతో చేసిన లడ్డూలను తింటే మేలు జరుగుతుంది. ఇది శరీరంలో వేడిని నిర్వహించి, జలుబు, దగ్గు నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. చలికాలంలో నువ్వులు, బెల్లం తినడం వల్ల చర్మం, జుట్టుకు చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఇది జుట్టులో మెరుపును కాపాడుతుంది. వృద్ధాప్యాన్ని కూడా దూరం చేస్తుంది. శీతాకాలంలో ప్రజలు ఎక్కువగా సీజనల్ వ్యాధుల బారినపడుతుంటారు. తరచూ జలుబు, దగ్గు, గొంతు నొప్పి, గొంతులో గరగర వంటివి వెంటాడుతుంటాయి. అయితే, ఇలాంటి సమస్యల బారిన పడకుండా ఉండాలంటే..శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం మందపాటి దుస్తులు వేసుకుంటే సరిపోదు. శరీరానికి అంతర్గతంగా కూడా వేడిని అందించాల్సిన అవసరం ఉంది. దీని కోసం, నువ్వులు తినడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని ఆయుర్వేద ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. ఇవి శరీరాన్ని లోపల నుంచి వేడిగా మారుస్తుంది. కాబట్టి మీరు మీ ఆహారంలో తెల్ల నువ్వులను చలికాలంలో కచ్చితంగా చేర్చుకోవాలి. నువ్వులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరం లోపలి నుంచి వెచ్చగా ఉంటుంది. బెల్లంలో కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ ఉంటాయి. అదే సమయంలో, నువ్వులు ఆరోగ్యానికి మేలు చేసే కాల్షియం, మెగ్నీషియం, ఐరన్‌తో పాటు ప్రోటీన్, ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటాయి. చలికాలంలో నువ్వులు, బెల్లం మిశ్రమం జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. ఇది తగినంత మొత్తంలో ఫైబర్‌ను అందిస్తుంది. దాంతో జీర్ణ సమస్యలను తొలగించడంలో సహాయపడుతుంది. ఈ రెండింటిలోనూ ఐరన్ తగినంత పరిమాణంలో లభిస్తుంది. నువ్వులు, బెల్లం తినడం వల్ల రక్తహీనత తొలగిపోతుంది. రక్తహీనత ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నువ్వులలో మెగ్నీషియం తగినంత పరిమాణంలో ఉంటుంది. దీన్ని తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చలికాలంలో నువ్వులు, బెల్లంతో చేసిన లడ్డూలను తింటే మేలు జరుగుతుంది. ఇది శరీరంలో వేడిని నిర్వహించి, జలుబు, దగ్గు నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. చలికాలంలో నువ్వులు, బెల్లం తినడం వల్ల చర్మం, జుట్టుకు చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఇది జుట్టులో మెరుపును కాపాడుతుంది. వృద్ధాప్యాన్ని కూడా దూరం చేస్తుంది.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక



## 'డాకు మహారాజ్' ఘన విజయం సాధిస్తుంది


తొలిఅడుగు,,
సినిమా :
అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి వంటి వరుస ఘన విజయాల తరువాత గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మరో వైవిద్యభరితమైన చిత్రం 'డాకు మహారాజ్'తో అలరించబోతున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్ తో 'డాకు మహారాజ్'ను నిర్మించారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా ఆదివారం 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం శుక్రవారం రాత్రి హైదరాబాద్ లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా 'డాకు మహారాజ్' రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇటీవల విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్యంగా విజువల్స్ అద్భుతంగా ఉన్నాయనే పేరు వచ్చింది. ఇక ఇప్పుడు రిలీజ్ ట్రైలర్ అంతకుమించి అనేలా ఉంది. 'వాడి ఒంటి మీద పదహారు కత్తి పోట్లు, ఒక బుల్లెట్ గాయం.. అయినా కిందపడకుండా అంత మందిని నరకాడం అతను మనిషి కాదు, వైల్డ్ యానిమల్' అనే డైలాగ్ తో బాలకృష్ణ పాత్ర ఎంత శక్తివంతంగా ఉండబోతుందో తెలిపారు. అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలు, కట్టిపడేసే భావోద్వేగాలతో అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఈ చిత్రాన్ని రూపొందించారని రిలీజ్ ట్రైలర్‌తో మరోసారి స్పష్టమైంది. ప్రీ రిలీజ్ వేడుకలో గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ "అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి సినిమాల్లో నేను పోషించిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి.

## కీళ్ల నొప్పులపై సమంత పోస్ట్ వైరల్

తొలిఅడుగు, , సినిమా : హీరోయిన్ సమంత తన అభిమానులతో నిత్యం టచ్‌లో ఉంటారు. ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ (ఎక్స్) వేదికగా రెగ్యులర్‌గా పోస్టులు పెడుతూ తన జీవితంతో ముడిపడిన కీలక వివరాలను అందరితో పంచుకుంటూ ఉంటారు. తాజాగా ఆమె ఇన్‌స్టాలో ఒక స్టోరీ పెట్టారు. ఇటీవలే తనకు చికెన్ గున్యా వచ్చిందని, దాని వల్ల అలుముకున్న కీళ్ల నొప్పుల నుంచి కోలుకుంటున్నానని సమంత వెల్లడించారు. ఓ వైపు చికెన్ గున్యా బారినపడినా.. జిమ్ చేయడాన్ని ఆమె ఆపలేదు. ఈ పోస్ట్‌లో తాను జిమ్ చేస్తున్న ఒక ఫొటోను సమంత జతపరిచారు. "చికెన్ గున్యా వల్ల వచ్చిన కీళ్లనొప్పుల నుంచి కోలుకోవడంలోనూ చాలా ఫన్ ఉందండోయ్" అనే కామెంటుకు బాధతో కూడిన ఎమోజీలను సమంత జతచేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. దీన్ని చూసిన నెటిజన్లు వేగంగా స్పందిస్తున్నారు. సమంత త్వరగా చికెన్ గున్యా నుంచి, కీళ్ల నొప్పుల నుంచి కోలుకోవాలని కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఫిట్‌నెస్, డైట్‌లపై సమంత ఎక్కువ ఫోకస్ పెడుతుంటారు.



## పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో నటిస్తుంది ఈ భామ



తొలిఅడుగు, సినిమా : 'ది సబర్మతి రిపోర్ట్' సినిమాతో ఇటీవల సూపర్ హిట్ అందుకుంది నటి రాశి ఖన్నా. ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేసిన ఈ భామ ప్రస్తుతం బాలీవుడ్‌కి షిఫ్ట్ అయిన విషయం తెలిసిందే. షాహిద్ కపూర్ నటించిన ఫర్జీతో పాటు విక్రాంత్ మస్సే 'ది సబర్మతి రిపోర్ట్' చిత్రాలతో మంచి హిట్లు అందుకుంది. ప్రస్తుతం తెలుగులో సిద్దు జొన్నలగడ్డ నటిస్తున్న తెలుసుకదా సినిమాతో పాటు తమిళంలో అగాథియా అనే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో నటిస్తుంది ఈ భామ. అయితే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ అమ్మడు సౌత్ సినిమా అభిమానులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రాశి మాట్లాడుతూ.. దక్షిణాదిలో సినిమా అభిమానులు ఎక్కువ అక్కడ హీరోలని దేవుడి లాగా కోలుస్తారు. సినిమా విడుదల అప్పుడు పండుగల భావిస్తారు. అందుకే సౌత్‌లో ప్రేక్షకులు తిండి అయిన మానేస్తారు ఏమో కానీ సినిమాలు చూడడం మాత్రం ఆపారు. అదే నార్త్‌లో ప్రజలు సినిమాలు పక్కన పెట్టి మిగతా వాటికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తారు. ఆ తర్వాత సినిమాలు చూస్తారు అంటూ రాశి ఖన్నా చెప్పుకోచ్చింది.

## నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన 'బ్లాక్ వారెంట్'..

తొలిఅడుగు, సినిమా : మొత్తం మీద ఇవాళ 'బ్లాక్ వారెంట్' వెబ్ సిరీస్‌ను ఎంతోమంది నెట్‌ఫ్లిక్స్‌లో చూశారు. 'బ్లాక్ వారెంట్' వెబ్ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఇవాళ (జనవరి 10) విడుదల అయింది. జైలు కేంద్రంగా సాగే ఈ కథలో బాలీవుడ్ ఐకాన్ దివంగత శశి కపూర్ మనవడు జహాన్ కపూర్ ప్రధాన పాత్రను పోషించారు. దీనికి విక్రమాదిత్య మోత్వానీ దర్శకత్వం వహించారు. సిధాంత్ గుప్తా, అనురాగ్ ఠాకూర్, పరంవీర్ సింగ్ చీమా కీలక పాత్రలు పోషించారు. ప్రముఖ జర్నలిస్ట్ సునేత్రా చౌదరి, తిహార్ జైలు మాజీ సూపరింటెండెంట్ సునీల్ గుప్తాలు కలిసి రాసిన 'బ్లాక్ వారెంట్ : కన్ఫెషన్స్ ఆఫ్ ఎ తిహార్ జైలర్' పుస్తకం ఆధారంగా ఈ వెబ్ సిరీస్‌ను తీశారు. వాస్తవిక గాథలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. వాటినే కళ్లకు కట్టేలా 'బ్లాక్ వారెంట్' వెబ్ సిరీస్‌లో చిత్రీకరించారు. దీనికి సంబంధించిన ట్రైలర్‌ను జనవరి 3న విడుదల చేశారు. మొత్తం మీద ఇవాళ 'బ్లాక్ వారెంట్' వెబ్ సిరీస్‌ను ఎంతోమంది నెట్‌ఫ్లిక్స్‌లో చూశారు. వీరిలో పలువురు సోషల్ మీడియా వేదికగా తమదైన శైలిలో రివ్యూలు రాస్తున్నారు. వారి ప్రకారం.. బ్లాక్ వారెంట్ వెబ్ సిరీస్ పార్ట్ 1లో సునీల్ గుప్తా తిహార్ జైలులో పనిచేసిన తొలి నాలుగేళ్లలో జరిగిన సంఘటనల సమాచారం ఉంది. జైలులో ఉండే విధి విధానాలు, ఖైదీల సంక్షేమం కోసం అమలు చేసే సంస్కరణలు వంటి అంశాలను ఇందులో తెరకెక్కించినట్లు తెలిసింది. డైనమిక్ యంగ్ జైలర్ హోదాలో సునీల్ గుప్తా పాత్రలో జహాన్ కపూర్ చాలా బాగా నటించారనే టాక్ వినిపిస్తోంది. జైలులో ఖైదీల మధ్య జరిగే రాజకీయాలు, ఆధిపత్య పోరాటాలు, ఖైదీల మధ్య జరిగే ఘర్షణలు వంటి అంశాలు బ్లాక్ వారెంట్ వెబ్ సిరీస్‌లలో సవివరంగా చూపించబోతున్నారు. కరడుగట్టిన నేరస్తులను చూసిన తిహార్ జైలుతో ముడిపడిన స్టోరీ అంటే సహజంగానే అందరికీ ఆసక్తి కలుగుతుంది. అందుకే దీని వెబ్ సిరీస్‌లకు కూడా మంచి ఆదరణ లభించే అవకాశాలు ఉన్నాయి.



# క్రికెట్ అన్ని ఫార్మాట్లకు వరుణ్ ఆరోన్ గుడ్‌బై





తొలిఅడుగు, ఢిల్లీ : జార్ఖండ్‌కు చెందిన టీమిండియా పేసర్ వరుణ్ ఆరోన్(35) అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. క్రికెట్ అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్లు ఇన్‌స్టాలో వెల్లడించాడు. 2025 విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో జార్ఖండ్ మ్యాచ్‌లు పూర్తయిన అనంతరం వరుణ్ తన నిర్ణయాన్ని ప్రకటించాడు. ”గత 20ఏళ్లు క్రికెట్ ప్రపంచంగా జీవించా.. అపారమైన అనుభవం, కృతజ్ఞతతో స్వచ్ఛందంగా అన్ని ఫార్మాట్లనుంచి వైదొలుగుతున్నా..” అని పోస్ట్ చేశాడు. 2010-11 విజరు హజారే ట్రోఫీతో వెలుగులోకి వచ్చిన వరణ్.. గంటకు 150కి.మీ. వేగంతో బంతులు సంధించాడు. టీమిండియా తరఫున 9టెస్టులు, 9వన్డేల్లో 29 వికెట్లు తీశాడు. 2015 నవంబర్‌లో దక్షిణాఫ్రికాపై బెంగళూరులో చివరిసారిగా మ్యాచ్ ఆడాడు. లిస్ట్-ఎ క్రికెట్‌లో 88మ్యాచుల్లో 26.47 సగటుతో 141 వికెట్లు పడగొట్టాడు. 95 టి20ల్లో 93 వికెట్లు సాధించాడు. ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) ఢిల్లీ డేర్‌డెవిల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు.

# రాణించిన తేజల్, రావల్



తొలిఅడుగు, ఐర్లాండ్ : ఐర్లాండ్ మహిళలతో జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఘన విజయం సాధించింది. సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ గెలిచిన ఐర్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 238పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని స్మృతి మంధాన సేన 34.3ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 239 పరుగుల లక్ష్యాన్ని.. మరో 15.3 ఓవర్లు మిగిలుండగానే ఛేదించింది. ప్రతీక రావల్ (89బీ 10ఫోర్లు, సిక్సర్), తేజల్ (53నాటౌట్‌బీ ఫోర్లు) అర్ధ శతకాలతో చెలరేగారు. కెప్టెన్ స్మృతి మంధాన(41) కీలక ఇన్నింగ్స్ ఆడింది. హర్లీన్ డియోల్(20) ఫర్వాలేదనిపించింది. ఐర్లాండ్ బౌలర్లలో మాగ్రైర్‌కు మూడు, ఫ్రెయా ఒక వికెట్ తీసింది. అంతకుముందు తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. ఓపెనర్ గాబీ లూయిస్(92), లే%ఎ% పాల్(59) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో ప్రియా మిశ్రాకు రెండు, టిటాస్ సద్ధు, సయాలి, దీప్తి శర్మ తలో వికెట్ తీశారు. రెండో వన్డే ఆదివారం జరగనుండగా.. మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ప్రతిక రావల్‌కు దక్కింది. ఐర్లాండ్ మహిళలతో జరిగిన తొలి వన్డేలో 41 పరుగులు కొట్టిన టీమిండియా కెప్టెన్ స్మృతి మంధాన ఓ రికార్డును తన ఖాతాలో వేసుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో వేగంగా నాలుగు వేల పరుగుల మార్క్‌ను అందుకున్న భారత క్రీడాకారిణిగా రికార్డుపుటల్లోకెక్కింది. వ్యక్తిగత స్కోరు 41పరుగుల వద్ద ఫ్రేయా సార్జెంట్ బౌలింగ్‌లో ఓర్లా ప్రెండర్‌గాస్ట్ చేతికి క్యాచ్ ఇచ్చి అవుటైంది. ఈ సిరీస్‌కు రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ దూరం కాగా.. స్మృతి సారథ్య బాధ్యతలు చేపట్టింది. తొలుత మిథాలీ రాజ్(112ఇన్నింగ్స్) ఈ ఘనత సాధించగా.. మంధాన(85ఇన్నింగ్స్)లోనే ఈ ఫీట్‌ను అందుకుంది.




## 2022లో నాపై విషప్రయోగం జరిగింది

తొలిఅడుగు డెస్క్ : టెన్నిస్ స్టార్ నోవాక్ జకోవిచ్ సంచలన ఆరోపణ చేశాడు. 2022లో తనపై విషప్రయోగం జరిగినట్లు తాజా ఇంటర్వ్యూలో వెల్లడించాడు. 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి ముందు జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ జకో ఈ వ్యాఖ్యలు చేశాడు. 2022లో మెల్‌బోర్న్‌లోని ఓ హోటల్‌లో తనకు విషపూరిత ఆహారం ఇచ్చినట్లు, సీసం, పాదరసం కలిసి ఉన్న ఆహారాన్ని ఇచ్చినట్లు తెలిపాడు. కోవిడ్ వ్యాక్సిన్ వేసుకోని కారణంగా.. ఆ ఏడాది ఆస్ట్రేలియా నుంచి తాను వైదొలగాల్సి వచ్చిందని, అలాగే వీసాను రద్దు చేసి ఆ టోర్నీ ఆడకుండా వెనక్కి పంపించేశారంటూ పలు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన జకోవిచ్.. ఈ ఏడాది జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్గొంటున్నాడు. ఆదివారం నుంచి ఆ టోర్నీ జరగనుంది. 11వ సారి అతను ఈ టోర్నీలో పాల్గొంటున్నాడు. 2022 ఆస్ట్రేలియా వివాదం తన కెరీర్‌ను ఇబ్బంది పెట్టినా.. ఆస్ట్రేలియా ప్రజల పట్ల తనకు ఎటువంటి ద్వేషభావం లేదన్నాడు. తానేమీ వ్యాక్సిన్‌ను అనుకూలం, వ్యతిరేకం కూడా కాదని, కానీ శరీరానికి తగినట్లుగా వాటిని తీసుకునే హక్కు తనకు ఉందని, ఆ అంశంలో మరొకరి ప్రోద్భలం అవసరం లేదని తెలిపాడు.

## జడ్డూకు చోటు దక్కేనా!

తొలిఅడుగు డెస్క్ : భారత క్రికెట్‌లో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాది ప్రత్యేక స్థానం. బౌలింగ్, బ్యాటింగే కాకుండా అద్భుతమైన ఫీల్డర్‌గా పేరు తెచ్చుకున్నాడు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తను కేవలం సుదీర్ఘ ఫార్మాట్‌కే పరిమితమయ్యేలా కనిపిస్తున్నాడు. ఎందుకంటే ఇప్పటికే జడ్డూ టీ20లకు వీడ్కోలు పలకగా.. తాజాగా వన్డేల్లోనూ అతడిని కొనసాగించడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నెలలో ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీసలతో పాటు ఫిబ్రవరి 19 నుంచి జరిగే చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టును ప్రకటించాల్సి ఉంది. అంతేకాకుండా 2027 వరల్డ్‌కప్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని యువ ఆటగాళ్లకు స్థానం కల్పించాలి. ఈనేపథ్యంలో జడ్డూకు చోటు దక్కడం కష్టమేనన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు 2023 వన్డే వరల్డ్‌కప్ తర్వాత 50 ఓవర్ల ఫార్మాట్‌లో అతను జట్టుకు ఆడింది లేదు. అలాగే ఆల్‌రౌండర్ విభాగంలో జడ్డూకు అక్షర్, సుందర్, దూబే, రియాన్ పరాగ్ గట్టి పోటీ ఇస్తున్నారు. హార్దిక్‌కు ఎలాగూ బెర్త్ ఖాయమే. దీనికి తోడు ఇటీవలి ఆస్ట్రేలియా పర్యటనలోనూ జడేజా ఆకట్టుకోలేకపోయాడు. అతను ఆడిన మూడు టెస్టుల్లో తీసింది నాలుగు వికెట్లే. బ్యాటింగ్‌లో మాత్రం ఓ అర్ధసెంచరీ చేశాడు. అందుకే భవిష్యత్ టోర్నీల్లో జడ్డూ లేకుండానే ముందుకు వెళ్లాలని సెలెక్టర్లు భావిస్తున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. అయితే ఇంగ్లండ్‌తో ఆడబోయే టెస్టు సిరీస్‌లో మాత్రం జడేజా స్థానానికి ఢోకా ఉండకపోవచ్చు. కాగా, మిడిలార్డర్‌లో అనుభవజ్ఞుడైన ఆటగాడు లేకపోవడం అతడికి కలిసొచ్చే అంశం.

# వాలీబాల్ ఛాంప్ తమిళనాడు

తొలిఅడుగు డెస్క్ : స్థానిక పి బి సిద్ధార్థ కళాశాల మైదానంలో జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ అండర్-19 బాలికల జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌గా తమిళనాడు నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో తమిళనాడు 3-0(25-11, 25-22, 25-9)తో కర్ణాటకపై ఘన విజయం సాధించింది. తమిళనాడు జట్టులో భారత జట్టు క్రీడాకారిణిలు పవిత్ర, ప్రతిభ, సాధనలు నెట్‌పై అద్భుతమైన షాట్లు కొట్టి కర్ణాటక జట్టుకు కోలుకోలేని దెబ్బకొట్టారు. తమిళనాడు ఆల్‌రౌండ్ ఆటతీరు ప్రదర్శించి సునాయాసంగా టైటిల్‌ను చేజిక్కించుకుంది. కర్ణాటక జట్టు రన్నరప్‌గా నిలిచింది. తొలుత తతీయ స్థానానికి జరిగిన పోటీలో హర్యానా 3-0(25-22, 26-24, 25-13)తో కేరళను చిత్తుచేసింది. తొలి రెండు సెట్లలో కేరళజట్టు హర్యానాకు గట్టి పోటీనిచ్చింది. మూడో సెట్‌లో హర్యానా విజృంభించి అద్భుతమైన షాట్లతో కేరళను మట్టికరిపించి తతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి భానుమూర్తి రాజు, వాలీబాల్ అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఏ వి రమణారావు, శాప్ మాజీ చైర్మన్ పి అంకమ్మ చౌదరి, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శి కె వి రాధాకృష్ణ, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వి. రవికాంత పాల్గొన్నారు.

